# విడదీసే రైలుబళ్ళు

కథానిక

ఆ కిటికీ దగ్గర నిల్చుని అలా శూన్య దృష్టితో గంటల తరబడి అవతలకి చూసేవాడు. అతన్ని చూస్తే మెళుకువగా వున్నట్టే తోచేది కాదు. ప్రపంచాన్నే మరచి అలా చూచే అతన్ని ఏదో 'తెలియని' లేమి అస్తమానం బాధించేది. తన యింట్లోనే, తను పుట్టిపెరిగిన వూరిలోనే వున్నా అతనేదో నా అన్నవాళ్లెవరూ లేనట్టు బాధపడుతున్నాడు. అన్నీ వుండీ కూడా, యీ భావం అతన్నెందుకావహించిందో మరి? తను పుట్టి పదిహేడు సంవత్సరాలు పెరిగిన వూరది. నాలుగు నెల్లనుంచి అక్కడే ఉంటున్నాడు. అయినా ఏదో బాధ అతన్ని వదలడం లేదు. చిన్నతనంలో తన కానందాన్నిచ్చిన దృశ్యాలు అక్కడే వున్నాయ్. కాలం సాగిపోయినా అవి ఎక్కువగా మారిపోలేదు. నీలాకాశం, రాత్రింబవళ్లు, వేసవిపూల వాసనలు యివన్నీ తన హృదయాన్ని ఉప్పొంగించి, ఆత్మకి శాంతినిచ్చాయి- తను స్వప్రదేశానికి వస్తూన్నప్పుడు నగరంలో అయ్యే అర్థంలేని చప్పుళ్లూ, వీధిలో హడావిళ్లూ, తరువాత అంతా తమతమ యిళ్లకు పోయినప్పుడూ-తనని యీ బాధ వదల్లేదు కాలంలో, స్థలంలో ప్రతి అంగుళంలోనూ, యిల్లు వాకిలీ, నా అనేవి అనేకం కనిపిస్తునే వున్నాయి. తల్చుకుంటే ఒకసారి అతనికే నవ్వు వచ్చింది. మరి యీ బాధేమిటి? తనకీ, లోకం దృష్టిలో ఓ యిల్లూ, నా అన్న జీవితం యింకా అన్నీ ఉన్నాయి. కాని అతనికి లేవు. నా అన్న దాన్ని ఎక్కడైతే హాయిగా వుండకలడో దాన్ని కని పెట్టితే జీవితం సార్థకం అయినట్టే, లేకుంటే, తిరిగి యీ వూరు వదిలి బైట ప్రపంచానికి పోదాం అనుకున్నాడు. అన్నీ వుండీ ఏం లేదనుకునే యీ స్నేహరహిత స్థితే, అతనిలో యేదో మార్పు తెచ్చింది. అతని ఆత్మని నిశ్చేష్టపరిచింది. అతని ఆధ్యాత్మికాందోళనా, పరధ్యానమూ-ఇంకా, ఏపనీ చెయ్యలేకపోడానికి కారణం కూడా అదే. ఇదెంతదాకా వచ్చిందంటే, అతనిలో ఓ మానవాతీతమైన ప్రశాంతం ఏర్పడింది—అతను నిద్రించితే అది నిద్రకాదు. మెళకువగావుంటే అది మెళకువా కాదు—ఎవరితో మాట్లాడుదామన్నా కష్టం అనిపించింది. పోనీ అని, యీ ప్రశాంతం కాని, నిర్మలత్వం కాని, నేర్పు కాని, తన చిత్రాల్లోనేనైనా చూపలేకపోయాడు. సాయంత్రం తన స్టూడియో వదలి వీధిలోకి వెడతాడు ఎంతో ఆశతో ఎవరితోనేనైనా మాట్లాడుదామని. కాని నడిచినడిచి, కొన్ని గంటల తరువాత, అదే మానసిక వ్యథతో యింటికి చేరుకుంటాడు. ఒకసారి ఇలాగే పోయిపోయి, చవకగావచ్చే ఓ వేశ్య యింటికి వెళ్లాడు. ఒక అమ్మాయితో గదిలో ప్రవేశించేడు. అర్థంలేకుండా ఆమెని తదేకధ్యానంతో కొంతసేపు చూచి ఆమె హడలిపోయేలా పైకి గట్టిగా నవ్వేడు. క్షమించమని కోరాడు. రెండు నోట్లకి బదులు మూడు ఆమె చేతిలో పెట్టి కాళ్ళీడ్చుకుంటూ యిల్లు చేరుకున్నాడు.

అతడు యిలా ఎన్ని గంటలు, ఎన్ని రాత్రులూ వాళ్లు బాధపడ్డాడో తెలియదు. ఇన్నీ అయాక, ఆ కిటికీలోంచి అలా వచ్చేపోయే రైళ్ళని చూస్తుంటే అతనికేదో కొంత మనస్థిమితం కలిగినట్టు తోచింది. రోడ్డు అవతలిపక్కే రైలు స్టేషను. యీవిషయం ఎందుకో అతనికానందం చేకూర్చింది. అతనికి తెలియకపోయినా, ఒక రకంగా, "చలనానికి" తను దగ్గరగానే వున్నందుకు ఆనందించాడు. స్టేషను వదలి వెళ్ళేరైళ్లు అతన్నెంతో విచారంలో ముంచేవి. వచ్చేవి అతని హృదయాన్ని పొంగించేవి. ఆరైళ్ల నుండి దిగిన మనుష్యుల్ని గురించి తెగ ఆలోచించేవాడు. వాళ్లెవరో! ఎక్కణ్ణుంచి యిక్కడికి వచ్చారో? ఎందుకు

కె. రామలక్ష్మి

యిక్కడికే రావలసివచ్చిందో? యిలాగే ఏవేవో ఆలోచించేవాడు.

ఒకరోజు, ఓ నాజూకైన అమ్మాయి స్టేషను లోంచి పైకిరావడం చూశాడు. నల్లచీర కట్టుకుంది. ఇంత దూరాన్నుంచి చూచినా, ఎంతో హాయిగా కనిపించింది. (ఆ హాయికి కారణం ఆమె అందం మటుకు కాదని తోచింది అతనికి! మరేమిటో?) ఆమె నడక చూచి, ఎందుకో ఆమె భయపడుతున్నట్టూ, ఒంటరితనంతో బాధపడుతున్నట్టూ భావించాడు. కిందకి పరిగెత్తుకెళ్ళి, ఆమెని పలకరించాలనిపించింది. "నేను ఫలానా-చిత్రకారుణ్ణి. నా స్టూడియోకి వచ్చి విశ్రమించండి" అని అందామనుకున్నాడు. యిన్ని అనుకున్నా అతను చేసిందేంలేదు. అలా చూస్తూ వుండిపోయాడు. ఆమె అలా నడిచి దూరమయ్యాక కూడా, వెనక పరుగెత్తుకెడదామనుకున్నాడు. ఒకరోజు తరువాత ఆ వూళ్ళో ఆమె ఎక్కడుంటుందో వెతికి చూద్దామనుకున్నాడు, ఓ వారం గడిచాక, ఆమె ఎక్కడుందో అని తలపోశాడు.

మళ్ళీ తిరిగి యథాప్రకారంగా, మానవ వ్యూహాతీతమైన ప్రశాంతం అతన్ని ఆవహించ సాగింది. ఇంక చేసేదిలేక-దానికి లోబడిపోవడం మొదలెట్టాడు. అంతకీ భరించలేకపోతే దానినుంచి తప్పించుకునే మార్గం అతి సులభం. ఏదో రైలు ఎక్కేస్తే సరి-అది ఎక్కడికేనా తీసుకుపోతుంది. ఎక్కడేనా ఇంత బాధ పడక్కరలేదు. ఏదోకొంత పడ్డా భరింప శక్యంగా వుంటుంది. లోబరచుకోడం కూడా సులభం అని తలపోశాడు. చిన్నపిల్లలు కలలుగనే వూళ్ళన్నీ చూశాడు. కాని వాట్లని చేరడానికి రైళ్ళూ, పట్టే కాలమూ తప్ప యింకేంలేవు అడ్డంకులు అనిపెందతనికి. అంతకుపైన, వెళ్ళడానికీ రావడానికీ డబ్బుంటే చాలు. ఇంకా రూపాయి అణా పైసలదృష్టిలో చూస్తే, ఆయావూళ్ళగురించి కలలు కనేంత ఏంలేదనిపించింది ఆతనికి. ప్రపంచంలో ఏచోట్లోనైనా మానవులు మానవుల్లాగే వుంటారు. వారిలో ఎక్కువ తేడా లుండవు. ఏవూళ్ళోనైనా వింత అనేది మనం సృష్టించుకున్నదే. మనుష్యుల కోరికల బలాబలాలు సృష్టించినదే. దేశదేశాల్లోని చూడవలసిన స్థలాలూ, వస్తువులూ ప్రపంచంలో మనుష్యుల హృదయపు లోతుల్లోనే వుంది యిల్లనేది. అంతే కాని ఎక్కడ పడితే అక్కడ రాళ్ళతోటీ సున్నంతోటీ కట్టిన యిళ్ళన్నీ నిజమైన యిళ్ళుకావు. ఇల్లనేది ఒక స్థలమే అయితే అతను యింట్లోనే వున్నాడే! అది ఒక స్థలం కాదు...అతి సున్నితమైనవీ క్షణక్షణమూ మారేవీ కొన్ని పదార్థాలూ, రాగపూరితమైన కొన్ని వుద్దేశాలూ, విలువలూ కొందరికోనివి కలిసి, సంపూర్ణంగా మిళితమైనప్పుడు ఏర్పడే కుటుంబంలోనో అవన్నీ ఏకమైన ఒకేఒక ప్రాణిలోనో, ఏకమైన యిద్దరి హృదయాల్లోనో వుంటుంది...అసలైన నిజమైన యిల్లు. చూస్తే, అతనిలోనూ అతను పలకరిద్దామనుతున్న ఆఅమ్మాయిలోనూ వుందేమో! మరి యిద్దరూ కలుసుకున్నాక, నిజంగా వుంటుందో వుండదో ఈ భావం హృదయం సతతమూ సృష్టించే ఎండమావుల్లో ఒకటేమో! ఇది నిజమేమోఅని అతనికి భయం వేసింది. అయితే నిజమైనయిల్లు అన్వేషించటంలో తను యీవూరూ, యీ అమ్మాయినీ వదిలేయాలేమో! ఇక్కడ వుండడమా? లేకుంటే రైలెక్కి తెలియని స్థలాల్లో తనకి కావలసిన దానికోసం వెతకడమా? ఈ రెంటిలో ఏదో ఒకటి చెయ్యాలి. అక్కడే ఉండాలనిపించింది. ఉంటే కొన్నేనా బొమ్మలు వేయవచ్చు. ఏదో తెలియని తుది ఘడియలు ఎదురుకోడానికి తనలో మిగిలిన సర్వశక్తీ ధారపోయలేమో!

రైళ్లు వస్తూపోతూనే వుంటాయి. వాటి కూతకోసం ఎంతో ఆత్రుతతో ఎదురుచూశాడు. వాటికూతలో మానవ క్రూరత్వం అంతా యిమిడినట్లు తోచింది అతనికి. ఒకదాన్ని పొందడం కోసం ఆరటపడి, తుదికి ఆత్మలేని దేహాన్ని పొందినట్లు, తిరిగి అదే హృదయావేదనతో ప్రయాణం సాగిస్తున్నట్టు కనిపించాయి రైళ్లు — రైలుకి దారితెన్నూవుంది. కాని, మానవ మానసిక ప్రయాణానికి ఏం అడ్డంకులూలేవు. అర్థంలేని అమోఘమైన స్థలాలుచేరడానికి ప్రయత్నిస్తుంది మానవహృదయం! ఒకటేమిటి? ప్రాణకోటిన తనీ, అనంతమైన యీ విశ్వాన్నంతటినీ, యింకా కావలిస్తే, దైవాన్నే చేరాలని ప్రయత్నిస్తుంది!

జీవితం ఎలాగా నిస్సారంగావుంది. ఏమయినా ఒక నిశ్చయానికి రావాలనుకున్నాడు. ఒక శని

వారంపూటా, మిట్ట మధ్యాహ్నం బయలుదేరాడు. కాఫీ అదీ తాగుతూ అక్కడి మనుష్యుల్ని చూస్తూంటే, చాలా ఆనందంగావుంది. శరీరంపూర్తిగా అలసిపోయేదాకా తెగతిరిగాడు రోడ్లమీద. తుదికి నాలుగుగంటలవుతూంటే, ఒక పార్కులో చెట్టునీడని అలసిన మేను వాల్చాడు. నిద్రిస్తున్న అతని ముఖంచూస్తే, చాలాకాలం నుంచి అలసి, ఉత్సాహరహిత జీవితాన్ని గడిపే వాడిలా తోచింది. ఎన్నోమాసాలు నిద్రించాననుకుని హడావిడిగా లేచాడు. అప్పుడే సూర్యాస్తమానం అవుతోంది. ఎదురుగా చెట్టుకి ఆవలి వైపుని ఆనుకుని ఓ అమ్మాయి కూర్చుని వుంది. తన కళ్ళని తానే నమ్మలేక, ఒకసారి కళ్లు నులుపుకుని చూశాడు. ఏదో పుస్తకం చదువుకుంటోంది తన ప్రసక్తే లేకుండా. వెళ్ళి పలకరించాడు. "నేను ఫలానా చిత్రకారుణ్ణి, యీ ఊళ్ళోనే పుట్టి పెరిగాను" అని తన్ని గురించిచెప్పుకున్నాడు. ఆమె నవ్వింది, అందంగా నేవుంది అతని కళ్ళకి. "నాది యీ వూరు కాదు." "ఏవూరైనా ఫరవా లేదు." "ఉద్యోగం డబ్బూవుంటే ఎక్కడున్నా ఒకటే" అంది. "అవును" అన్నాడు. "నా స్టూడియోకి రండి బొమ్మలు చూద్దురుగాని. విశ్రాంతి తీసుకుందురుగాని" అన్నాడతను. ఆమె లేచింది.

ఏదో తెలియని ఆనందం అతన్ని ఉన్మత్తుణ్ణి చేసింది. ఆమె సాంగత్యంలో మానసిక సంపూర్ణత ఆమె ఇవ్వగలదనేనమ్మకం కుదిరిందిఅతనికి. ఆమె మీద తన భవిష్యత్తు ఆధారపడివుందనుకున్నాడు. బొమ్మలు చూపించాడు. ఆమె కేమంత నచ్చలేదు. అంతేకాదు అర్థంకాలేదు, "అన్నిటిని గురించీను" అని తెలియ చెప్పాడు. ఇంతట్లో రైలు కూత వినిపించింది. ఆమెని తీసుకుని కిటికీదగ్గిరికి వచ్చాడు. ఎంతో సంతృప్తిచెందాడు. ఆమె కూడా ఎంతో ఆనందిస్తుంది యీ రైళ్ల రాకపోకల్ని గురించి అనుకున్నాడు. అందుకే ఆమె భుజంమీద చెయ్యివేసి, కిటికీదగ్గర నిలుచుని చూస్తుంటే అతని హృదయం ఎంతో తేలికైంది. ఆమె కొంచెం కదిలి, తనకేసి సతృప్తిగా చూస్తే! తిరిగి వెళ్ళి ఆమె కుర్చీలో కూర్చుంది. అతను కిటికీదగ్గరేవున్నాడింకా. భయంతో మాట్లాడలేకపోయాడు. ఏమి చెప్తుందో! అది తన భవిష్యత్తుకే యిరుసు! "రైళ్లెంతచప్పుడు చేస్తాయి కదూ?" అంది ఆమె. రైలు కూతకూసి బయలుదేరింది. రైలు చప్పుడికి నిజంగానే యిల్లోసారి కదిలినట్లైంది. కొన్ని క్షణాలతరువాత మళ్ళీ నిశ్శబ్దం ఆవరించింది. ఆమెకేసిచూచి చిరునవ్వునవ్వాడు. ఆపుకోలేక గట్టిగా నవ్వేడు. ఆమె లేచి అతన్ని సమీపించపోయింది——

"రైళ్లకి దూరంగా పోదాం. అక్కడ యింక మనిద్దరికీ ఏ బాధా వుండదు." అన్నాడు అతను బొమ్మలు సర్దుతూ.

"రైళ్లు చూస్తే నాకు భయం. అవి ఆప్తుల్ని విడతీస్తాయేగాని, సాధారణంగా దగ్గరికి చేర్చవు." అంది ఆమె అతని తల నిమురుతూ.

నిజమైన యింటికి పునాది వేశాననుకున్నాడు చిత్రకారుడు, ఆమెని తన చేతుల్లోకి తీసుకుంటూ.

మన పట్టణనాగరికతలో ఒకభాగం ఏమిటంటే ఎల్లప్పుడూ దుర్భరమైన శబ్దాలతో నిండి ఉండడం. అనేకులిది సహించి ఊరుకుంటున్నారు. సహించలేనివాళ్లు ప్రశాంతమైన పల్లెసీమలు పట్టుకు ప్రాకులాడుతారు. పాపం, ఒక గ్రీకువేదాంతి యిలా వ్రాసుకున్నాడు: "దూరతీరాల్లో కుటీరాలకోసం, ఏకాంతంగా ఉన్న సముద్రతీరాలకోసం లేదా కొండకోనలకోసం, మానవులు తహతహలాడడం తెలివితక్కువ. అవసరం అయినప్పుడల్లా ఏకాంతంలోకి వెళ్ళిపోవడం మన చేతిలో ఉన్న శక్తి. మన హృదయాంతర్యంకన్న ప్రశాంతమైన, ఏకాంతమైన చోటు యీ జగత్తులో యింకేముంది!"—డీన్ ఇంజ్